# అతితెలివి

యాముజాల శంకరం

మా రంగారావు బెజవాడలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికీ నాకూ చుట్టరికాని కంటే, పరిచయం జాస్తి. నారాయణరావు అతనికీ నాకుకూడా స్నేహితుడు. అందుకని మమ్మల్నిద్దర్నీ బెజవాడ రావలసిందని ఉత్తరం వ్రాశాడు. గాంధిపార్కు దాటిం తర్వాత మూడవ సందులో మూడు క్రాస్ రోడ్లు దాటిం తరువాత మూడో యిల్లే తమదని విభజనగా వ్రాశాడు. సరదాగా నేను, వేరే కొంతపనివుండి రావు, యిద్దరం బెజవాడ చేరుకున్నాం.

నేను చిన్నతనంనుండి కూడా ఆడవాళ్ల ముఖం పరీక్షగా చూడలేను. అదో రకమైన సిగ్గు నన్నావరిస్తుంది. అందులోచుట్టం, పైపెచ్చు మిత్రత్వం-ఇక వేరేచెప్పాలా. అందుకని అతని భార్య ఎలా ఉంటుందో సరిగ్గా (అంటే గుర్తు పెట్టుకునేంత) చూచిన పాపాన పోలేదు తరచు వాళ్ళయింటికి వెళుతూంటం మూలాన, ఏవో కొన్ని ఆనమాళ్లు మాత్రం ఊహించగలను.

ఇక మేము ప్రముఖులం. రెండో సందులో ప్రవేశించాం. ఎవరో అమ్మాయి ఓ యింటి వీధి అరుగుమీద నిలుచోనుంది. పోలికలు కొన్ని కలిశాయి. అనుమానంతో నే,

“రంగారావు వున్నాడా?” అన్నాను.

ఇంకేముంది-అతితీవ్రంగా మీద విరుచుకు పడుతుందా అన్నట్టు ఒక్క చూపు చూచి, చక్కా లోపలికి దూరి తలుపు వేసింది. ఆ మాత్రం వర్తనమున్నందుకు నేను, రావు చాల సంతోషించాం.

రెండడుగులు ముందుకువేశాం. ఇంకేం? ఆవిడే, పంపు దగ్గర నీళ్ళు పడుతోంది. ఆవిడే రంగా భార్య

“మీరెక్కడుంటున్నారండి. అబ్బ తిరగలేకచచ్చాం. ఆఁ. ఇంతకీ రంగా ఉన్నాడా?”

“ఎవరాయన? ఎందుకు నన్నిలా అడుగుతున్నారు?”

ఇలా గర్జించే సరికి గుండె గతుక్కుమంది. ఆవిడైతే నన్నల్లా అడగదు. నేను ఆవిడ్ని గుర్తు పట్టలేకపోయినా, ఆవిడమాత్రం నన్ను ఇట్టే గుర్తు పట్టగలదు. ఎందుకంటే, సహజంగా ఆడవాళ్ళు మాట్లాడుతూంటే మనముఖాన్ని ఊరికే చూస్తూ మాట్లాడతారు. మనం తల వంచుకుని వినాలి. ఎత్తి కండ్లలో కండ్లు కలపలేము. ఎందుకో మనకే తెలియదు. దాన్నిబట్టి ఈ నిర్ణయానికి వచ్చా అయితే ఈవిడ ఆవిడన్నా కాకపోవాలి, లేదా నన్ను మరచిపోయినైనా ఉంటాలి. ఎందుకంటే యీమధ్య కొత్త రాకపోకలు బందు అయినాయిలెండి, లేదా ఆవిడలో మార్పయినా (మెదడులో) వచ్చి ఉండాలి. ఇక ఆఖరుకు, నేను పొరబడి అయినా ఉండాలి. కాని, ఎంత ఆలోచించినా, ఆవిడ నన్ను గుర్తుపట్టలేదంటే నేను నమ్మను. అసంభవం.

నా తల్లో ఇలా గిర్రున తిరుగుతున్న ఆలోచనలమీద ఫెడేలున దెబ్బ కొట్టినట్లు,

“ఈ మగాళ్ళకేక పనంటూ వేరే ఉండదేమో. బుద్ధి ఉంటేగా. అందుకే వీళ్ళబుద్ధుల కొద్ది ఇంత బువ్వ. ఒంటరిగా ఆడది కనుపిస్తే తల గిర్రున తిరుగుతుందేమో. ఇవన్నీ పోగాలపు బుద్ధులే! బుద్ధంటూ ఉండాలి” అంటూ, రుసరుస భరతనాట్యం చేస్తూ, చంకన కూజా పెట్టుకొని చర్రున దారి పట్టింది!

“హా! అత్మకణా! బ్రతికాంరా.” అన్నా నిట్టూరుస్తూ.

“ఒకేయ్! ఆమాత్రం ఆనవాలు పట్టలేవురా. ఛీ! నీ జన్మ తగలెయ్యా. ఇక ఎవర్నీ అడక్కు నీకో దండం కాని.”

“మరెల్లారా?”

"మూడు రోడ్లుదాటింతరువాత కాంపౌండు వాలుంటుందని వ్రాశాడుగా. అది దాటితే మూడో యిల్లట. అది కనబడితే సరేసరి. లేదా, హోటలు ఉండనే ఉంది" అన్నాడు.

ఇక ఆడాళ్ళని గుర్తించటంగాని, వాళ్ళతో మాట్లాడటంగాని, అడగటం గాని వెంటనే బందుచేశాను. కలిసిన మొగవాణ్ణి కలిసినట్టు అడిగాం. కాని ఎవడో ఆ రంగారావు ఎవడికి తెలుస్తుంది?

ప్రొద్దు నెత్తిమీదికి వచ్చింది. తలా కాళ్లు పీటితో పాటు కడుపు కాలుతోంది. కనుచూపు మేరలో కాఫీహోటలు బోర్డుకూడా కనీసం కనుపించటంలేదు. రిక్షాలుకూడా కరువయ్యాయి. మూలమలుపున పంపుంటే, ముఖం అదీ కడిగి, కడుపునిండా యిన్ని నీళ్లుత్రాగి, చెరో సిగరెట్టు ముట్టించాం. ఇట్లాచేస్తే ఆకలి చస్తుంది, కడుపులో కాస్త నిండుగాఉంటుంది. ఇది సిగరెట్ల వల్ల ముఖ్య ఉపయోగం.

కలిసిన వాణ్ణల్లా అడిగాం. వెతికాం. పరిశోధన చేయగా చేయగా మాకో కాంపౌండువాలు కనుపించింది. దానిలో మూడు ఇండ్లు కాబోలు ఉన్నాయి. మూడోఇల్లన్నాడు కాబట్టి, ఆ కాంపౌండులో ఉన్న యిళ్లన్నీ ఒక్కేయింటి క్రింద జమకట్టి, దానితరువాత మూడోయింట్లో జొరబడి:

"రంగారావ్!" అన్నాం.

"ఆఁ...ఉన్నారు రండి!" అన్నాడో ముసలాయన.

నా కాశ్చర్యంవేసింది. ఇంతవరకు నేను వారి బంధువుల్ని, మిత్రుల్ని ఎందర్నో చూచాను! ఇల్లాంటి ముసలాయన నెన్నడూ చూడలేదు. ఏమో! దూరపుచుట్టమేమోననుకున్నా. ఇంట్లో ప్రవేశించి, చూపించిన ఆసనాలపై బైఠాయించాం. ఇహ ఆయన మొదలు పెట్టాడు.

"రంగా ఇలా యిప్పుడే బజారు కెళ్లాడు. ఈపాటికి రావలసిందే. ఏం పనుండి ఆగిపోయాడో మరి."

"ఫరవాలేదండి" అన్నా.

"రంగా మీకు చుట్టమా?"

"అవునండి .."

"మీదేవూరు?"

"..........."

"అంతా క్షేమమేనా?"

"ఆఁ..."

"అయ్యో! నా తెలివితేటలు మండ. పార్వతీ! పార్వతీ! ఇంటికి చుట్టాలొస్తే యింత కాఫీ అయినా పెట్టించకుండా కూర్చున్నా. పార్వతీ!" అంటూ కేకలు వేయడం మొదలెట్టాడు.

అమ్మయ్య! ఇప్పటికి నాకు కొంచెం ధైర్యం చిక్కింది. ఎందుకంటే రంగా భార్య పేరు పార్వతి. కాబట్టి యీయిల్లు రంగాదే అయితే ఈ ముసలాయన? ఎవరో దూరపు చుట్టాలయి ఉండాలి. ఎంతసేపటికీ ఆవిడ పలకకపోయేసరికి, ఈయనే లోపలకువెళ్ళి అగ్గరిచ్చితిరిగివచ్చాడు.

ఈ లోపున రావు నాతో ఇలా అన్నాడు:

"ఈయనెవరో?"

"ఏమోరా! బహుశా రంగా దూరపు చుట్టమేమో!"

ఆయన ప్రవేశిస్తూనే... "ఇదిగో! కాఫీ ఇప్పుడే వచ్చేస్తుంది," అంటూ కుర్చీలో కూలబడి "ఆఁ... అన్నట్టు మరచిపోయా. రంగాకి మొన్ననే ప్రమోషన్ వచ్చింది. ఇప్పుడు రెండు వందలు యించుమించు వస్తాయి"

"సంతోషం" అన్నా. చూస్తూంటే మనిషి లొడలొడ వాగేవాడిలా కనుపించాడు. దేశీయ విదేశీయ, జాతీయ, అంతర్జాతీయ... అబ్బబ్బ ఒకటా...ఒకదాని తరువాత మరోదానిమీద ఉపన్యాసాలు దంచేస్తున్నాడు. మాకు అమృతాంజనంఉంటే బాగుండునుకదా అనుపించింది.

రావు ఉండబట్టలేక నాతో ఇలా అన్నాడు:

"లోపలకు వెళ్ళి ఆవిడకు చెప్పిరా— ఇల్లు తెలిసిందిగా. వెళ్ళొద్దాం" అన్నాడు.

సరేనంటూ, పేరుబెట్టిపిలుస్తూ రెండడుగులు వేసా: ముసలాయన అనుమానంతో నామూతి చూస్తున్నాడు. ఆయన ముఖకవళికలు మారిపోతున్నాయి ఇంతలోకే పార్వతే వచ్చింది. ఇంకేముంది? ఎవరో రోలింగుస్టోను, నాముఖం అణా కానీ అంతఅయింది ఆవిడమమ్మల్ని చూచి తుర్రున లోపలికి దూరింది. నా హృదయం దడదడకొట్టుకుంది. ధైర్యంతో:

"ఈ రంగారావు యింటి పేరేమిటండి?" అన్నా.

"రాసనాల. రంగారావు కాదే–రంగనాథం"

చచ్చాంరా బాబు. "మాకు కావలసింది ఈయన కాదులెండి" అని లేచాం. ఒకే యింట్లో రంగా పేరేగాదు, పార్వతి అనే ఆవిడకూడా ఉంటే నా కాశ్చర్యం వేసింది. అలా ఉంటారని నేనూహించలేకపోయా. మర్యాదగా బయటకు నడిచాం.

దార్లో రావిలా అన్నాడు. "నువ్విక్కడి నుంచి యింటి పేరుతో సహా అడగందే యింట్లో ప్రవేశించకు. ముసలాడు కాబట్టి సరిపోయింది. ఆ రంగనాథమే ఉంటే ఎలా ఉండేదో ఆ కాంపౌండులోని మూడో గుమ్మం చూద్దాం పద."

సరేచేయనన్నాను. ఇంట్లో ప్రవేశించకుండా వీధి గుమ్మంలోంచే "మల్లాది రంగారావు" అన్నా.

"ఇక్కడ రంగారావు లేడు ఎవ్వరూ లేడు పొండి" అని జవాబొచ్చింది.

"ఇహ మనకు యిల్లు దొరకదు. హోటలుకు పోదాం నడు" అన్నాడు రావు. తిరిగి పోతూఉంటే ఎదురుపడ్డాడు రంగా తమ్ముడు సుబ్బులు. ఆయనతో జరిగిందంతా చెపితే పకపక నవ్వి "ఆ కాంపౌండులోని మూడో యింట్లో మేడమీద ఉంటున్నాం. మొన్ననే ప్రవేశించాం కాబట్టి వాళ్ళకు మా పేర్లు బాగా తెలియవు" అన్నాడు.

రావు సిగరెట్టు కాలుస్తూ క్రింద ఆగిపోయాడు. అతనికోసం నేనూ ఆగాల్సి వచ్చింది. సుబ్బులు తెచ్చిన సామానులు పైన పెట్టేందుకు మెట్లెక్కిపోయాడు.

కాస్త ఆగింతరువాత మేమూ యెక్కాం. మొదటి గుమ్మంలోంచి లోపలికిపోయి, వేసిన మంచంమీద కూర్చున్నాం. ఇంతలో యెవరో ముసలాయన బయటకు వచ్చి "ఎవరు మీరు" అన్నాడు. ఈ ముసలాడితో నా కెందుకనుకున్నా. బూట్లువిప్పి, క్రిందపెట్టి దర్జాగా కాళ్లు కొంచెంగా పైకి క్రిందికి కదుపుతూ కులుకుతూ కూర్చున్నా.

"ఏమిటిది? ఎవరు కావాలి మీకు" ఇహ సమాధానం చెప్పక తప్పలా. "రంగారావు" అని కొంచెం ఘట్టిగానే అన్నా. ఆ సరికి ప్రక్కగదిలోంచి "ఇదోయ్ మాయిల్లు. ఇటు రండి" అని జవాబొచ్చింది.

బ్రతుకుజీవుడా అని విడచిన బూట్లు ఒక చేత్తో, సంచి మరోచేత్తో పట్టుకొని ధ్వని వచ్చిన ప్రక్కగదిలోకి ప్రవేశించాం. "ఆ ముసలాయనింకా మంచివాడు. ఆయన కొడుకు ఉంటే మిమ్మల్ని యీ పాటికి కొట్టును." అని రంగారావు చెప్పటం మొదలుపెట్టాడు. ఇంతలోకే ఓ అమ్మాయి మా గుమ్మంలోంచి ఆ గుమ్మంలోకి పోతోంది. ఆవిడే మిమ్మల్నేగాక, మొత్తం మొగాళ్ళకే బుద్ధిలేదన్న (పంపు దగ్గర) మహాతల్లి.

"ఈవిడెవరోయ్ రంగా" అన్నా.

"ఈవిడే ఆయన కోడలు"

"భలే సంసారంరా బాబు!" అంటూ తు. చ. తప్పకుండా 'అ' కారాది పర్యంతం 'క్ష' కారాంతంవరకు జరిగినవన్నీ చెపుతూ ఉంటే పొట్ట రెండుచేతులతో పట్టుకొని, నవ్వలేక చచ్చాడు.

ఇంతలోనే పార్వతి కాఫీ తెచ్చింది. ఈ దఫా అయినా గట్టిగా చూచి, బాగా జ్ఞాపకం పెట్టుకుంటే, ఇహ ఇలాంటి అవాంతరా లెప్పుడూరావు కదా అనుకున్నా. ఓరకంటితో ఓ చూపు విసురుదామనుకున్నా. కాని రంగా ప్రక్కనే ఉన్నాడే? ఎలా? ఏం అనుమాన పడతాడో? ఇందులో తప్పేముంది? కాని, ఆ మాట ఆయన అనకోవద్దూ. ఏమైనా కాని అని ఒక్కసారి గబుక్కున అట్లా చూచి, ఇట్లా కండ్లు దించేశా. ప్రక్క చూద్దును కదా రంగా నాకేసి చూస్తున్నాడు.

"అంతా క్షేమమా!"

ఆలా ఎంతసేపటినుంచి అడుగుతున్నాడో మరి. నా లోకంలోంచి ఈ లోకంలోకి వచ్చేందుకు చాలాసేపు పట్టింది. ప్రబుద్ధుడనయ్యా. బలవంతంగా ముఖంమీదికి చిరునవ్వు తెప్పించుకొని, అతి కష్టంమీద పెగలని గొంతుకని చీల్చి, "ఆఁ..." అంటూ సమాధానమిచ్చా.

తర్వాత ఆలోచిస్తే, ఆవిడను గుర్తుపట్టేంత ఘట్టిగా చూడలేదని మాత్రం రూఢిగా తెలుసుకున్నా. ఎట్లాగైనా, ఎప్పుడో సమయం తీరుబడిగా చూచి ఆవిడని గుర్తు పెట్టుకోవా అనుకున్నా.